సాక్షి
వరంగల్
సోమవారం | 27 | ఫిబ్రవరి | 2023



'ఐలోని'కి పోటెత్తిన భక్తజనం
ఐలోని మల్లికార్జునస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. -8లో▸



కరాటే ఆత్మస్థైర్యాన్నిస్తుంది
ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కరాటే శిక్షణ దోహదపడుతుందని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. -8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $37^0/19^0$
జిల్లాలో వాతావరణం ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

4న ఉపాధ్యాయులకు ప్రత్యేక సదరం

హన్మకొండ అర్బన్: దివ్యాంగ ఉపాధ్యాయులకు తెలంగాణ ఉపాధ్యాయుల రెగ్యులేషన్ ఆఫ్ తెలంగాణ రూల్స్–2023 ప్రకారం మార్చి 4న ఎంజీఎం మెడికల్ బోర్డులో సదరం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన దివ్యాంగ ఉపాధ్యాయులు, గతంలో హాజరై సదరం సర్టిఫికెట్ వ్యాలిడిటీ పూర్తయిన వారు, ఇంతవరకు క్యాంపునకు హాజరుకాని వివిధ కేటగిరీల వారికి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదరం స్లాట్ కోసం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉపాధ్యాయులు సంప్రదించాలని ఆయన కోరారు.

ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎం ఫార్మసీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఫీజు చెల్లించేందుకు అపరాధ రుసుము లేకుండా మార్చి 4 వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఆదివారం తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో మార్చి 8 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. అన్ని పేపర్లకు రూ.1000, రెండు పేపర్ల వరకు రూ.500, ఇంప్రూవ్‌మెంట్ పేపర్‌కు రూ.300 చొప్పున చెల్లించాలని తెలిపారు.

6 నుంచి బీటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. మార్చి 6, 8, 10, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిసుర్ ఉర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా అందించే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


రేపు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడానికి సోమవారం ఉదయం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ రాంనగర్‌లోని హనుమకొండ డిపో నుంచి ఈనెల 28న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట, ధర్మసాగర్, కమలాపూర్, ఖిలా వరంగల్, ఎల్కతుర్తి మండల ప్రయాణికులు 99592 26047 నంబర్‌కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు, సమస్యలు వివరించాలని కోరారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ వాయిదా

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ సెల్‌ను వాయిదా వేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా గ్రీవెన్స్ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తమ అర్జీలు అందించడానికి మంగళవారం కార్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా డీఏఓ పరీక్ష



విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్(డీఏఓ) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 7 రూట్లలో 22 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.ఉదయం సెషన్‌లో 11,580 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 8,038 మంది అభ్యర్థులు(69.41 శాతం) పరీక్ష రాశారు. మధ్యాహ్నం రెండో సెషన్‌లో 7,926 మంది అభ్యర్థులు (68.45) హాజరుకాగా.. 3,654 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. డీఆర్వో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రంలో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.



కలలు.. కల్లలు..

ర్యాగింగ్ రక్కసికి వైద్య విద్యార్థిని బలి

డాక్టర్ కావాలనే పట్టుదల ఆమెది. అదే లక్ష్యంతో ఎంతో కష్టమైనా ఇష్టపడి చదివింది. పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించింది. ఎంసెట్‌లో మెరుగైన ర్యాంక్ సాధించి వైద్య సీటు సంపాదించింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె వైద్య విద్యలో పీజీ చేస్తోంది. పట్టా చేతికొచ్చాక స్టెత్ పట్టి ఎందరికో సేవ చేయాలనుకుంది. తన కలలను, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా ప్రముఖ వైద్యురాలిగా పేరు తెచ్చుకోవాలనుకుంది. కానీ.. ఆమె కలలన్నీ కల్లలయ్యాయి. ర్యాగింగ్, వేధింపుల భూతానికి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆమె మృత్యువుతో పోరాడి.. మళ్లీ బతికి రావాలనుకుంది. అర్ధాయుష్షురాలిగా అందని తీరాలకు పయనమై ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది.

- ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడిన పీజీ వైద్య విద్యార్థిని
- కేఎంసీ, ఎంజీఎం ఆస్పత్రిలో విషాద ఛాయలు
- ర్యాగింగ్, వేధింపులతో ఆత్మహత్యాయత్నం
- కౌన్సెలింగ్ జరిగిన మరుసటిరోజే ఘటన



కేఎంసీ ఎదుట పోలీసుల బందోబస్తు

సాక్షి, వరంగల్/ఎంజీఎం: సీనియర్ విద్యార్థి వేధింపులు, ర్యాగింగ్‌కు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పీజీ వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి(26) ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి తనువు చాలించింది. దీంతో వరంగల్‌లోని కేఎంసీపాటు ఎంజీఎం ఆస్పత్రిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేసుకున్న ప్రీతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి ఆర్ఐసీయూలో ఐదు రోజులపాటు వెంటిలేటర్ పైనే చికిత్స అందించారు. అయితే ఆదివారం రాత్రి 9.10 గంటలకు కన్నుమూసిందని వైద్యులు ప్రకటించారు. మంత్రి హరీశ్‌రావు కూడా ప్రీతిని బతికించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదని, ఆమె మరణించడం బాధగా ఉందన్నారు.

వాట్సాప్ చాటింగ్ గొడవ..

డిసెంబర్ 6న సైఫ్, ప్రీతిల మధ్య చాటింగ్ వార్ నడిచింది. తర్వాత మూడుసార్లు గొడవలు జరిగినా సద్దుమణిగాయి. అయితే అనస్తీసియా విభాగానికి సంబంధించి 31 మందితో ఏర్పాటుచేసిన ఓ వాట్సాప్ గ్రూప్‌లో ఈనెల 18న చేసిన పోస్టుతో గొడవ ముదిరింది. ఓ హౌస్ సర్జన్ విద్యార్థితో కేస్ షీట్ రాయించడాన్ని ప్రస్తావిస్తూ 'ప్రీతికి సరైన బ్రెయిన్ లేదు. బుర్ర తక్కువ మనిషి అంటూ సైఫ్ కామెంట్ పెట్టాడు. దీనిని అవమానంగా భావించిన ప్రీతి 'యూ మైండ్ యువర్ ఓన్ బిజినెస్' అంటూ వ్యక్తిగతంగా సైఫ్‌కు మెసేజ్ పెట్టింది. ఇది వేధింపులకు పరాకాష్ట అయింది. కాలేజీలో అన్ని విషయాలను నాన్న నరేందర్‌కు ప్రీతి చెప్పడంతో మట్టెవాడ పోలీసులను ఆశ్రయించాడు.

కౌన్సెలింగ్ మరుసటి రోజే..

ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె తండ్రి నరేందర్ పోలీసులకు ఇచ్చిన సమాచారంతో ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ ఆదేశాల మేరకు హెచ్‌ఓడీ నాగార్జునరెడ్డి బుధవారం ఉదయం సైఫ్, ప్రీతిలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మరుసటి రోజు ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మొదట తల, ఛాతి నొప్పి ఉందని ట్రెమాడాల్ ఇంజక్షన్ తీసుకుందని ప్రచారం చేశారు. అయితే ఆమె అనస్తీషియా ఇంజక్షన్ తీసుకోవడం వల్లే ప్రాణపాయ పరిస్థితికి చేరి ఉండొచ్చని వైద్యులతోపాటు పోలీసులు పేర్కొంటున్నా నిర్ధారణ కాలేదు.

చదువులో మేటి ప్రీతి..

2001 నుంచి 2011 వరకు హైదరాబాద్ ఉప్పల్ సెయింట్ మార్క్ పాఠశాలలో చదువుకున్న ప్రీతి.. ఎస్ఎస్‌సీలో 526 మార్కులు సాధించింది. 2011 నుంచి 2013 వరకు హైదరాబాద్ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి 970 మార్కులు సాధించింది. ఎంసెట్ పరీక్ష రాసి 5వేల ర్యాంకు సాధించి కామినేని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా 2013లో వైద్యవిద్యను ప్రారంభించి 2019లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. పీజీ కోర్సు కోసం ప్రయత్నిస్తూ 2022లో రైల్వేలో మెడికల్ ఆఫీసర్‌గా కరోనా సమయంలో వైద్య వృత్తిని నిర్భయంగా నిర్వహించింది. అనంతరం పీజీ ఎంట్రెన్స్‌లో ఆలిండియా 1,161 ర్యాంకు సాధించి కేఎంసీలో అనస్తీషియా పీజీ విభాగంలో అడ్మిషన్ పొందింది. ఆమెకు చదువంటే మక్కువ ఎక్కువని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

సైఫ్‌ను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులతో ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే విషయాన్ని వైద్య విద్యార్థులు, ఎంజీఎం అధికారులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించినప్పటికీ పోలీసులు తమ విచారణలో వేధింపులు నిజమేనని వెల్లడించారు. ఈ క్రమంలో సైఫ్‌పై ర్యాగింగ్, వేధింపులు ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసు నమోదు చేసి.. ప్రీతిని ఇబ్బందులకు గురిచేసిన తీరును సీపీ రంగనాథ్ వెల్లడించారు. ఈ నెల 24న అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కోసం ఖమ్మం జైలుకు తరలించారు.

కరోనా సమయంలోనూ..

కరోనా విస్తరిస్తూ ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్న సందర్భంలోనూ సికింద్రాబాద్ రైల్వే ఆస్పత్రిలో అధికారిక పోస్టింగ్‌లో లేకున్నా ప్రీతి తాను వైద్యురాలినని పేర్కొంటూ రైల్వే ఉద్యోగులకు సేవలందించారు. ఆమె తండ్రి రైల్వే విభాగంలో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో తన తండ్రితో కలిసి పనిచేస్తున్న వారందరికీ రైల్వే ఆస్పత్రిలో సేవలందించిందని రైల్వే అధికారులు తెలిపారు.

టాక్సికాలజీ నివేదిక కోసం..

ప్రీతి బుధవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడే ముందు తన ఫోన్‌లోని గూగుల్ సెర్చ్‌లో సాధారణ వ్యక్తికి అనస్తీషియా డ్రగ్ తీసుకుంటే ఏం జరుగుతుందనే విషయాన్ని స్టడీ చేసిన విషయాన్ని పోలీసులు సైతం గుర్తించారు. అలాగే పోలీసు విచారణలో ఆమెకు సక్సీ నైలోకోలిన్ అనే ఇంజక్షన్ దొరికిందని కూడా వెల్లడించారు. ప్రీతి మరణానికి ఆ అనస్తీషియా ఇంజక్షనే కారణమని భావిస్తున్నారు. ఇది నిర్ధారణ కావాలంటే టాక్సికాలజీ నివేదికలు రావాల్సి ఉంది. అనస్తీషియా ఇంజక్షన్ తీసుకోగానే శ్వాసక్రియ, రక్తప్రసరణ ఆగిపోయి కార్డియాక్ అరెస్టు అవుతుంది. సరైన సమయంలో కృత్రిమ ఆక్సిజన్ అందకపోవడంతో అవయవాలు దెబ్బతినే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఎమర్జెన్సీ ఈఓటీలో ఘటన

ఎంజీఎం ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో ప్రీతి విధులు నిర్వర్తిస్తుంది. విధుల్లో ఆమెతోపాటు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. ఉదయం 6 గంటల సమయంలో తలనొప్పి.. అలసటగా ఉందని చెప్పిన ప్రీతి నర్సు నుంచి ట్రెమాడాల్ ఇంజక్షన్ తీసుకుని వేసుకున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కొద్దిసేపటికి తన గదిలో స్పృహతప్పి పడిపోయిన విషయాన్ని గుర్తించి వైద్యులు ఆర్ఐసీయూ విభాగానికి తరలించారు. కార్డియాక్ అరెస్టు అయిన విషయాన్ని గుర్తించి సీపీఆర్ ద్వారా చికిత్స అందించగా కోలుకుంది. వెంటనే సీటీ పరీక్షలు నిర్వహించి వెంటిలేటర్ ద్వారా చికిత్స అందించిన అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు పంపించారు.

ఐదు రోజులుగా వైద్య చికిత్స..

ప్రీతిని మెరుగైన చికిత్స కోసం బుధవారం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా.. ఆదివారం వరకు చికిత్స అందించినా ఆరోగ్య పరిస్థితి మెరుగుపలేదు. ఎంజీఎంలో వైద్యులు పేర్కొన్న విధంగా పలు అవయవాలు దెబ్బతినడంతో ప్రీతిలో ఎలాంటి చలనం లేదు. గుండెకు సంబంధించి ఏజెక్షన్ ఫ్రాక్షన్ ఒఫ్ హార్ట్, గ్లోబల్ హిపోకైనేషియా, పాంక్రియాటూటిస్, అస్సైటీస్, ఊపిరితిత్తుల సమస్య తెలెత్తింది. ఎక్మో సపోర్ట్‌తో వెంటిలెటర్ ద్వారా చికిత్స అందించారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కావడంతో ఆమెకు వైద్య చికిత్స అందిచడం చాలా కష్టంగా మారింది. ఈ క్రమంలోనే పరిస్థితి విషమించి మృతి చెందిందని నిమ్స్ వైద్యులు ప్రకటించారు.

గిర్నితండాలో విషాద ఛాయలు | సైఫ్‌ను ఉరి తీయాలి | కేఎంసీ వద్ద పోలీసుల బందోబస్తు 8లో▸

నేడు సోడషపల్లికి మంత్రి కేటీఆర్ రాక



సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లికి రానున్నారు. రూ.133కోట్లతో చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్ట్‌తోపాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ పర్యటన, బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్షించారు. మండలాలవారీగా ఇన్‌చార్జ్‌లను నియమించిన ఆయన కార్యక్రమ సమన్వయకర్తలుగా ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్యలకు బాధ్యతలు అప్పగించారు.

మంత్రి కేటీఆర్ టూర్ షెడ్యూల్ ఇదీ..

- మధ్యాహ్నం 12.45 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు హనుమకొండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లిలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- అనంతరం మధ్యాహ్న భోజనం
- మధ్యాహ్నం 2.15 గంటలకు సుమారు రూ.133కోట్ల విలువ చేసే నీటిపారుదల ఎత్తిపోతల పథకం, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- మధ్యాహ్నం 3 గంటలకు సోడషపల్లిలోని ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 4.30 గంటలకు సోడషపల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ తిరుగు ప్రయాణం.

మంత్రి పర్యటన కోసం స్థల పరిశీలన



వరంగల్ (పర్వతగిరి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 8న ప్రతిమ కేన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏనుగల్ గ్రామంలో మహిళలకు ఉచిత కేన్సర్ చెకప్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా సభా స్థలిని పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సర్పంచ్ దమ్మికెట్టి సంధ్యారాణి నర్సింగం, ఏఎంసీ డైరెక్టర్ యుగేందర్‌రావు, నాయకులు భాస్కర్‌రావు, ఎంపీటీసీ కోల మల్లయ్య, చిన్నపాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫోన్ ఇన్

రేపు 'డయల్ యువర్ మున్సిపల్ చైర్‌పర్సన్'



మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ

వర్ధన్నపేట : వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని మీ వాడలో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయా.. కుక్కలు, కోతులు, పందులతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచి నీటి పైపులైన్ లీకేజీలు జరుగుతున్నాయా.. గుంతల రోడ్లతో వాహనదారులు నరక యాతన అనుభవిస్తున్నారా.. మీ సమస్యలను నేరుగా మీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు విన్నవించుకోవడానికి ... 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ నెల 28న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణతో ఏర్పాటు చేసిన ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోండి.

ఫోన్‌నంబర్లు
8187054042
9849261619
సమయం :
ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

దివ్యాంగులు ఎక్కువ.. యూనిట్లు తక్కువ

- తక్కువ యూనిట్ల మంజూరుతో ఇబ్బందులు
- ఎవరికి ఇవ్వాలో తెలియక అయోమయం
- రేపటితో ముగియనున్న దరఖాస్తుల ప్రక్రియ



కలెక్టరేట్‌కు తమ న్యాయమైన డిమాండ్లను తెలియజేయడానికి వచ్చిన దివ్యాంగులు (ఫైల్)

చెన్నారావుపేట/కాశోజీ సెంటర్: జిల్లాలో దివ్యాంగులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు వేలల్లో ఉంటే ప్రభుత్వం తక్కువ యూనిట్లు మంజూరు చేయడంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రతీ సంవత్సరం దివ్యాంగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. రాయితీ పథకంలో యూనిట్ల సంఖ్య మాత్రం ప్రభుత్వం పెంచడం లేదు. తాజాగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 20 యూనిట్లు (రూ.12.50 లక్షలు) మాత్రమే మంజూరు ఇచ్చింది. జిల్లాలో 11 మండలాలు, 3 మున్సిపాలిటీల్లోని దివ్యాంగులకు 13 మందికి రూ.50 వేల చొప్పున వందశాతం రాయితీపై సహకారం అందించడానికి నిర్ణయించారు. అలాగే 80శాతం రాయితీతో రూ.లక్ష, 70 శాతం రాయితీతో రూ.2లక్షలు, 60 శాతం రాయితీతో రూ.3లక్షల రుణాలు అందించనున్నారు. మొత్తం 20 యూనిట్లకు రూ.12.50లక్షలను రాయితీ కింద అందించనున్నారు. తక్కువ బడ్జెట్ కేటాయించడంతో ఇటీవల జిల్లాలోని దివ్యాంగులకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. కాగా ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని జిల్లా సంక్షేమ అధికారి ఎం. శారద తెలిపారు.

యూనిట్లు పెంచాలి..



ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి రాయితీ యూనిట్లు పెంచాలి. వేలల్లో దివ్యాంగులు ఉంటే జిల్లా 20 యూనిట్లు ఇవ్వడం బాధాకరం. చాలా మంది ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. దివ్యాంగుల సంఖ్యను బట్టి రాయితీ యూనిట్లు పెంచాలి.

–దేవర రాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

దరఖాస్తు గడువు పొడిగించాలి..



ఈ నెల 28వ తేదీ చివరి గడువును మరికొన్ని రోజులు పొడించాలి. రుణాలు తక్కువగా కేటాయించడంతో కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరుతుంది. అర్హులైన వారు నిరాశకు గురవుతారు.

–పల్లకొండ కుమారస్వామి, దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్

అభివృద్ధిపై చర్చకు రావాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్




మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట: వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిపై బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ బహిరంగ చర్చకు రావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ సవాల్ విసిరారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడిన దానిలో ఒక్క తప్పు ఉన్న తాము ముక్కు నేలకు రాస్తామన్నారు. నాలుగు సంవత్సరాలుగా తెగిపోయి ఉన్న కోనారెడ్డి చెరువు అభివృద్ధి గురించి పట్టించుకోని ఎమ్మెల్యే అభివృద్ధి చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎన్ని డబుల్ బెడ్ రూం ఇళ్లు పంచారో చూపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, సీసీ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి అని గొప్పలు చెప్పుకుంటూ ఊరూరా తిరుగుతున్నాడన్నారు. పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎప్పుడంటే అప్పుడు బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో కొండేటి సత్యం, చీటూరి రాజు, పిట్టల రాజు, రాయపునం కుమారస్వామి, విక్రం, టిక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన మోదుగు

వసంత రుతువులో పూచే మోదుగు పూలు చూపరులను కనువిందు చేస్తోంది. మోదుగు చెట్టుకు ఆకులే.. పూవులా.. అన్న చందంగా వచ్చే రంగుల హోళీకి తాను సిద్ధమంటోంది. ప్రకృతికి మరింత అందాన్ని ఇచ్చేలా మండలంలోని పనికర శివారులో కనువిందు చేస్తోన్న మోదుగు పూలు 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

–నెక్కొండ





-10లో▸

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సంఘటన స్థలంలో మృతురాలు లావణ్య

ములుగు రూరల్ (గోవిందరావుపేట): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో ఆదివారం ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పిపడడంతో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు గ్రామానికి చెందిన తాడూరి మనోహర్ – లావణ్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఈ నెల 21న హుస్నాబాద్ మండలం సంఢిళ్ల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో చల్వాయి గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహం అదుపుతప్పి కిందపడి పోయారు. ఈ ఘటనలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి లావణ్య(33) తల తగలడంతో తీవ్ర గాయాలపై అక్కడికక్కడే మృతి చెందింది. మనోహర్, ఇద్దరు పిల్లలకు గాయాలు కాగా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పస్రా ఎస్సై కర్ణాకర్‌రావు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు..


ప్రసాద్(ఫైల్)

మంగపేట: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు హరివెంకట సత్య సాయి వరప్రసాద్(53) ఆదివారం ఉదయం తన ఇంటి వద్ద మృతి చెందాడు. మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడైన ఆయన ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఐదు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన ఆదివారం విధులకు వెళ్లేందుకు సిద్ధమౌతున్న క్రమంలో హార్ట్ స్ట్రోక్ రావడంతో మృతి చెందినట్లు రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గద్దం శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యాయుడి మృతిపై పాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడికి భార్య కొడుకడు, కూతురు ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఉరి వేసుకుని మృతిచెందిన బానోత్ పంతులు

వర్ధన్నపేట: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని నీలగిరి స్వామి తండాలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు పంతులు(45) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసి మృతిచెందాడు. ఆడుకోవడానికి వెళ్లిన పంతులు కుమారైలు ఇంటికి చేరుకోగా ఇంట్లో ఉరి వేసుకున్న తండ్రిని చూసి చుట్టు ప్రక్కల వారికి తెలియజేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ గొడవలు కారణంగా మనస్తాపానికి గురై పంతులు ఉరేసుకుని ఉంటాడనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, ఆత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కూలీ పనుల నిమిత్తం ఉదయమే వరంగల్‌కు వెళ్లిన పంతులు భార్య సరోజ ఆస్పత్రికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించింది. మృతుడికి ముగ్గురు కుమారైలు చిట్టి, శిరీష, భూమిక ఉన్నారు. ఘటనపై ఎస్సై రామారావును వివరణ కోరగా మృతికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కరాటే ఆత్మస్థైర్యాన్నిస్తుంది

- ప్రతి పాఠశాలలో కరాటే శిక్షణకు చర్యలు
- 5వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ 2023 ప్రారంభం
- ఐటీడీఏ పీఓ అంకిత్, ఏఎస్పీ సంకీర్త్


పోటీలకు హాజరైన విద్యార్థులు


పీఓను సన్మానిస్తున్న కరాటే మాస్టర్లు


మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కరాటే శిక్షణ దోహదపడుతుందని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన భవనంలో సూర్య షోటోకాన్ అకాడమి ఆధ్వర్యంలో 5వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ 2023 పోటీలను ఐటీడీఏ పీఓ అంకిత్, ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, టోర్నమెంట్ డైరెక్టర్ పాయం సురేష్, టోర్నమెంట్ రెఫరీ, జడ్జీ చంద్రశేఖర్ ఆదివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ.. అందరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. జెడ్పీహెచ్‌ఎస్, గురుకులం, ఆశ్రమ పాఠశాలల్లో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతామన్నారు. గతంలో ప్రత్యేక శిక్షణలు ఇచ్చామన్నారు. విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యంతోపాటు స్వీయ రక్షణకు కరాటే ఉపకరిస్తుందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కరాటే అకాడమీ ఆర్గనైజర్లు ఉచితంగా విద్యార్థినులకు శిక్షణ ఇస్తే.. ఐటీడీఏ ద్వారా కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని అంకిత్ అన్నారు. ఏఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ..విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, నక్సల్స్ వైపు కానీ, వారి మాటలనుకానీ, ఎవరూ పట్టించుకోవద్దని అన్నారు. ప్రతి విద్యార్థి ఉద్యోగస్తులుగా ఎదగాలని అన్నారు. విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆటకట్టిస్తామన్నారు. ఆపదలో ఉన్నప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పారు. క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్‌పాషా, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్, కరాటే టోర్నీ నిర్వాహకులు సురేష్, బాలాజీ, జడ్జి చంద్రశేఖర్, సర్పంచ్ రామ్మూర్తి, పురుషోత్తం, ఖాజాపాషా, సుధాకర్, కోటయ్య, రాఘవులు, కరాటే మాస్టర్లు మైపతి సంతోష్, హనుమంత్, హనుమంత్‌రావు, సాంబయ్య, లక్ష్మణమూర్తి, స్వామి, వెంకటేశ్వర్లు, లావణ్య, మౌనిక పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వరల్డ్ పునకోషి షోటోకాన్ ఆర్గనైజేషన్ డిప్లమా సర్టిఫికెట్ బ్లాక్‌బెల్ట్ గ్రహీత లావణ్యకు సర్టిఫికెట్, బ్లాక్ బెల్ట్‌ను ఐటీడీఏ పీఓ అంకిత్, ఏఎస్పీ సంకీర్త్ అందజేశారు. గత ఏడాదిలో త్రైకాండో కరాటే మొదటి సౌత్ ఇండియా ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కరాటే మాస్టర్లను సంతస్కరించారు. అనంతరం ఐటీడీఏ పీఓ అంకిత్, ఏఎస్పీ సంకీర్త్‌ను కరాటే టోర్నీ నిర్వాహకులు సన్మానించారు. ఇదిలా ఉండగా.. రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌లో వరంగల్ జిల్లాకు చెందిన శ్రీరామ్ నాయక్ మొదటి విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

'ఐలోని'కి పోటెత్తిన భక్తజనం


శావ(రథం) లాగుతున్న భక్తులు


బోనాలు వండుతున్న మహిళలు

- మల్లన్న దర్శనానికి తరలివచ్చిన భక్తులు

ఐనవోలు: ఉగాది సమీపిస్తుండగా ప్రఖ్యాత ఐలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి వారాంతపు జాతరలో భాగంగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో మల్లన్న సన్నిధిలో సందడి ప్రారంభమైంది. స్వామి వారికి నిత్య కైంకర్యాలు శైవ ఆగమ పద్ధతిలో నిర్వహించి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలతో స్వామి వారిని అభిషేకించారు. శనివారం సాయంత్రమే ఆలయానికి చేరుకున్న భక్తులు పట్నాలు, బోనాల మొక్కులు చెల్లించుకుని ఆదివారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకుని ఒగ్గు సంప్రదాయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావ(రథం)లాగి మొక్కులు తీర్చుకోగా మరికొందరు వరం పట్టారు, వడి బియ్యం సమర్పించారు. టెంకాయ బందనం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణమంతా మల్లన్న నామస్మరణతో మార్మోగింది. భక్తుల రద్దీ అధికం కావడంతో ఎస్సై ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు లక్షమంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. దేవాలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.


ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకుంటున్న భక్తులు

గిరిజనుల సంక్షేమం పట్టని కేంద్రం

- లంబాడ భాషను జాతీయ భాషగా గుర్తించాలి
- మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: బీజేపీ ఎనిమిదేళ్ల పాలనలో గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని రాష్ట్ర మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో, రూ.2 కోట్లతో నిర్మిస్తున్న సేవాలాల్, మేరమయాడి ఆలయాల నిర్మాణ భూమిపూజలో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ పాలకుర్తికి, గిరిజనులకు ఎంతో చరిత్ర ఉందని, సీఎం కేసీఆర్ చొరవతో ఈ ప్రాంతాన్ని అధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా రూ.100 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గిరిజనులు మాట్లాడే భాషకు లిపి లేదని, ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో బిల్లు పెట్టి గిరిజన భాషకు లిపి కల్పించడంతోపాటు గిరిజన భాషకు జాతీయ భాషగా గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో సేవాలాల్ మహరాజ్, కొమరం భీమ్ భవనాలు నిర్మించాలన్నారు. గిరిజన రిజర్వేషన్ల విషయంలో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం, గత పాలకులు ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. గిరిజనుల సంక్షేమానికి సేవాలాల్ తరహాలో సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ గిరిజనుల పాలన సౌలభ్యం కోసం రాష్ట్రంలో రూ.600 కోట్లతో 3,146 గిరిజన జీపీలకు నూతన భవనాలు నిర్మిస్తున్నామని, తండాల్లో రోడ్లు మౌలిక వసతుల కల్పనకు రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పాలకుర్తిలో రూ.1.50 కోట్లతో బంజారా భవన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ ప్రాంతంలో ప్రతిష్ఠించే పోతన, సరస్వతీ దేవి నమూనా విగ్రహాలను క్యాంపు కార్యాలయంలో మంత్రులు పరిశీలించారు. తర్వాత మంత్రి దయాకర్‌రావు జనగామ కలెక్టర్ శివలింగయ్యతో కలిసి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సేవాలాల్ మహరాజ్ పీఠాధిపతి బాపూ సింగ్ మహరాజ్, మహబూబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, అడిషన్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సేవాలాల్ మందిర నిర్మాణ కమిటీ బాధ్యులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు పాలకుర్తి చౌరస్తా నుంచి గుడి నిర్మించే స్థలం వరకు లంబాడా సంప్రదాయ నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

రాయపర్తిలో క్షుద్రపూజల కలకలం

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని బతుకమ్మ కుంట ప్రాంతంలో బాలుడిని ఖననం చేసిన గోతిపైన ఆదివారం క్షుద్రపూజలు చేసిన ఘటన వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన ఓ నాలుగేళ్ల బాలుడు రెండు నెలల క్రితం మృతిచెందగా బతుకమ్మకుంట ప్రాంతంలో ఖననం చేశారు. ఈ క్రమంలో మూడు రోజులక్రితం గుర్తుతెలియని వ్యక్తులు మనిషి రూపంలో ఉన్న బొమ్మతోపాటు, పసుపు, కుంకుమను చల్లి పలు రకాల వస్తువులను సమాధిపై పెట్టి క్షుద్రపూజలు చేసినట్లు స్థానికులు గుర్తించారు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ చోటుచేసుకోలేదని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'నవజీవన్' జనరేటర్ కార్ బోగీలో పొగలు


పొగను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

మహబూబాబాద్ రూరల్ : అహ్మదాబాద్ నుంచి చైన్నై వెళ్లే నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు ఇంజన్ వెనకనే ఉన్న లగేజ్ బ్రేక్ అండ్ జనరేటర్ బోగి చక్రాల వద్ద బ్రేక్ లైనర్స్ పట్టడంతో పొగలు వచ్చాయి. దీంతో స్టేషన్లో మహబూబాబాద్ రైల్వే రైలును నిలిపివేశారు. పొగలు రావడంతో రైల్లో ఉన్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. మంటలు చెలరేగకుండా సిబ్బంది వెంటనే ఫైర్ సేఫ్టీ మేజర్మెంట్స్ ప్రయోగించి, మంటలు అదుపుచేశారు. మరమ్మతు అనంతరంత రైలును పంపించారు. దీంతో రైలు సుమారు రైల్వే స్టేషన్‌లో 40 నిమిషాల పాటు నిలిచిపోయింది. నవజీవన్ నిలిచిపోవడంతో ఈ రైలు వెనుకాలే వస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ రైలును రెండో నంబర్ ప్లాట్ ఫారం మీదుగా పంపించారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్ ఫారం మీదికి వస్తుండగా రైలు డ్రైవర్లు పొగను గమనించారని దీంతో వెంటనే మంటలు చెలరేగకుండా చర్యలు తీసుకున్నామని రైల్వే అధికారులు తెలిపారు.

ప్రీతి మృతితో 'గిర్నితండా'లో విషాదఛాయలు


తల్లిదండ్రులతో ప్రీతి(కుడివైపు)

కొడకండ్ల: గిరిజన సామాజిక వర్గానికి చెందిన వైద్య విద్యార్థి ధరావత్ ప్రీతి మృతితో ఆమె స్వగ్రామమైన జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ధరావత్ నరేందర్–శారద దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు సంతానం. వీరి కుటుంబం సుమారు 20 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడింది. చిన్న కుమార్తె ప్రీతి చిన్నప్పటి నుంచి హైదరాబాద్‌లో చదువుకుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో అనస్థీషియా పీజీకోర్సులో చేరింది. ఈ క్రమంలో ప్రీతికి సీనియర్ అయిన సైఫ్ వేధింపులతో గత బుధవారం ఆమె ఆత్మహత్యకు యత్నించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రీతి ఎలాగైనా మృత్యువును జయించి వస్తుందనే నమ్మకంతో ఐదు రోజులుగా గిర్నితండా వాసులు ఎదురు చూస్తున్న క్రమంలో మృతి వార్త తెలియడంతో అందరూ కంటతడిపెట్టారు. హైదరాబాద్‌లో స్థిరపడినా పండుగలు, బంధువుల ఇళ్లలో జరిగే శుభకార్యాల సందర్భంగా ప్రీతి తమ కుటుంబసభ్యులతో కలిసి ఇక్కడికి వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. డాక్టర్ కోర్సు పూర్తి చేసి తమకు వైద్య సేవలందిస్తుందని సంబురపడిపోయామని, ఇంతలో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా.. ఫిబ్రవరి 9వ తేదీన ధరావత్ నరేందర్–శారద దంపతులు తమ రెండో కూతురు వివాహం చేసినట్లు పేర్కొన్నారు.

సైఫ్‌ను ఉరితీయాలి


పాలకుర్తి టౌన్: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


పాలకుర్తి టౌన్: వైద్య విద్యార్థి ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కొడకండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధారవత్ సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లావుడ్యా భాస్కర్‌నాయక్, భూక్య శ్రీనునాయక్, రవి, రాము, హేమాన్, సిద్ధు, హరిచందర్, అనిల్‌కుమార్, తిరుపతి, హతీరాం, ఎడవెల్లి సోంమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ వద్ద పోలీసు బందోబస్తు

వరంగల్: మెడికల్ పీజీ విద్యార్థిని ప్రీతి మృతి చెందినట్లు నిమ్స్ వైద్యులు ప్రకటించడంతో ఆదివారం రాత్రి కాకతీయ వైద్య కళాశాల వద్ద జిల్లా పోలీసు యంత్రాంగం బందోబస్తును ఏర్పాటు చేసింది. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తులో ఉన్నారు.

'బండి'ని జోకర్‌లా చూస్తున్నారు..

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని ప్రజలు జోకర్‌లా చూస్తున్నారని .. పిచ్చోడి చేతిలో రాయిలా అతను మాట్లాడుతున్నాడని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జనగామ జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డితో కలిసి కడియం ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్, ఇతర చిన్నాచితకా పార్టీల నేతలు ఎందుకు యాత్రలు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పాదయాత్రలు చేసే వారికి క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన ఉండాలనీ.. కేవలం సీఎం కేసీఆర్‌ను, అధికార బీఆర్‌ఎస్ పార్టీని విమర్శించడమే లక్ష్యంగా యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఏమి తెచ్చారో ఇక్కడి బీజేపీ నేతలు చెప్పాలన్నారు. సమావేశంలో బెలిదె వెంకన్నగుప్తా, సీహెచ్.నరేందర్ రెడ్డి, సుగుణాకర్‌రాజు, మధుసూదన్‌రెడ్డి, సారంగపాణి, గణేష్ పాల్గొన్నారు.

బ్లేడ్‌తో గొంతుకోసుకున్న వృద్ధుడు

- అనారోగ్యంతో ఆత్మహత్యాయత్నం
- పరిస్థితి విషమం

నల్లబెల్లి: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు బ్లేడ్‌తో గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన వేముల రాజయ్య మల్లికాంబ దంపతులకు ఇద్దరు పిల్లలు. సుమారు 30 ఏళ్ల క్రితం మూడో కాన్పు సమయంలో మల్లికాంబ మృతి చెందింది. కాగా.. రాజయ్య తిరుపతమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. 10 ఏళ్ల పాటు వీరి దాంపత్య జీవితం సజావుగానే సాగింది. ఆ తర్వాత వారి కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో రాజయ్య మద్యానికి బానిసై 20 ఏళ్లుగా భార్య పిల్లలను వదిలి ఒంటరిగా ఉంటున్నాడు. ఈక్రమంలో గత నెల రోజులుగా రాజయ్య అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మానసిక ఆందోళనకు గురైన రాజయ్య ఆదివారం తనుంటున్న ఇంట్లో బ్లేడ్‌తో గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు.
విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాజయ్యను 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26759]

HOUSE FOR SALE

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26760]

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26761]

■ వరంగల్ రంగశాయిపేట శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26748]

PLOT FOR SALE

■ సుబేదారి నుండి పింగిలి కాలేజి వెళ్లే 60 ఫీట్ రోడ్డు గల మండల ప్రజా పరిషత్ ఎదురుగా ఉన్న 680 చ:గ:॥ నార్త్ ఫేసింగ్ ప్లాటు కమర్షియల్ ప్లాటు హాస్పిటల్స్, హోటల్స్‌కి అనుకూలమైనది. అమ్మకు. 9985777792. [W-775784]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, వారికి ఆర్థిక సహాయం చేయబడును. సెల్: 8331878592, హన్మకొండ. [WA-6500]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-11]

BUSINESS OFFER

■ Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283 [H-793615]

WANTED

■ హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥- 12గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000-15000. సంప్ర॥ 8688072125. [W-775835]

■ ప్రముఖ కార్పొరేట్ finance సంస్థలో పనిచేయడానికి అనుభవం కలిగిన టీం లీడర్స్ & కలెక్షన్ బాయ్స్ కావలెను. జీతం: 15000 to 20000/- వేల వరకు ఇంటర్వ్యూ 6th Febన జరుగును. సంప్ర॥ 8897653065. [WA-2927]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781850]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.